సోమశిలకు 12,407 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి 12,407 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. డ్యాంలో 74.952 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 300, క్రస్ట్‌గేటు, పవర్ టెన్నల్ నుంచి డెల్టాకు 7,650, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఇన్‌చార్జి డీపీవోగా వసుమతి

నెల్లూరు (జడ్పీ) : జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి అధికారి బాధ్యతలను నెల్లూరు డివిజన్ డీడీవో వసుమతికి అప్పగిస్తూ కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. డీపీవోగా ఉన్న శ్రీధర్‌రెడ్డి సీఈవోగా బదిలీ కావడంతో ఆమెకు బాధ్యతలు అప్పగించారు.


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

ఆదివారం 23 నవంబరు 2025



ఎండ-వాన

- రోజంతా ఇంతే..!

నెల్లూరు (హరనాథపురం) : కాసేపు ఎండ.. ఆ తర్వాత వాన నెల్లూరు నగరంలో శనివారం నాటి పరిస్థితి ఇది. అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లాలో సగటు వర్షపాతం 11.1 మిమీగా నమోదైంది. అత్యధికంగా గుడ్లూరులో 32.8 మి.మీ, అత్యల్పంగా టీపీ గూడూరులో ఒక మి.మీ వర్షం కురిసింది. ఆదివారం కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



అబ్బా.. ఏం చలి!

- వణికిస్తున్న శీతల వాతావరణం
- ఉదయం 9 గంటల వరకు ఇదే పరిస్థితి
- వృద్ధులు, చిన్నారులపై తీవ్ర ప్రభావం
- దినసరి కూలీలు, చిరు వ్యాపారులకు తప్పని పాట్లు
- పెరిగిన హీటర్ల వాడకం
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యనిపుణులు

8

అటు వాన.. ఇటు చలి... జిల్లావాసులను వణికించేస్తున్నాయి. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో వారం రోజులకుపైగా వర్షం కురవగా, దీని నుంచి తేరుకోకమునుపే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఇది చాలదన్నట్టు చలి చంపేస్తోంది. తెల్లవారుజామున మంచు, ఉదయం 9 గంటలకు కూడా చలి తీవ్రత తగ్గకపోవడంతో వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోతున్నారు. ఇక సాయంత్రం 6 గంటల నుంచే చలి మొదలవుతోంది. దీంతో చిరువ్యాపారులు, కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి నుంచి బయటపడేందుకు గ్రామీణ ప్రాంతాలలో చలిమంటలు వేసుకుంటున్నారు. చలిగాలుల ప్రభావంతో ప్రజలు ఆస్తమా, నెమ్ము, జలుబు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులతోపాటు జ్వరాలబారిన పడుతున్నారు. చలి ముగిసే వరకు ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

జిల్లా పరిషత్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- నూతన సీఈవో శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (జడ్పీ), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని సీఈవో శ్రీధర్‌రెడ్డి దెలిపారు. డీపీవోగా ఉన్న ఆయన్ను జడ్పీ సీఈవోగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో శనివారం ఆయన జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని స్పష్టం చేశారు. అంతకుమునుపు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను శ్రీధర్‌రెడ్డి కలిశారు.

రేపు లంకా దినకర్ రాక

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఈ నెల 24వ తేదీన సాయంత్రం 6 గంటలకు జిల్లాకు వస్తున్నారని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. మరునటి రోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకుకేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ పథకాల పురోగతిపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు. అనంతరం చెన్నైకి బయలుదేరి వెళతారని తెలిపారు.

మేయర్‌ను దించాల్సిందే!

- తెలుగుదేశం కార్పొరేటర్ల సమావేశం నేడు
- మంత్రి నారాయణ సారథ్యంలో భేటీ
- నెల్లూరు నగర, రూరల్ ముఖ్య నేతలకూ పిలుపు
- అవిశ్వాసానికి కార్పొరేటర్ల నుంచి సంతకాల సేకరణ
- రేపు కలెక్టర్‌ను కలిసి నోటీసు అందజేత



నెల్లూరు (సిటీ), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతికి (వైసీపీ) పదవీగండం ఏర్పడనుంది. శనివారం నాటికి మేయర్ పదవీ బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లు పూర్తవడంతో ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు న్యాయపరమైన చిక్కులు తొలిగాయి. దీంతో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నేతృత్వంలో కార్పొరేటర్లు, రెండు నియోజకవర్గాల (నెల్లూరు సిటీ, రూరల్) ముఖ్య నేతలు ఆదివారం సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ల నుంచి అవిశ్వాసానికి సంతకాలు సేకరించి సోమవారం కలెక్టర్, ఎన్నికల అధికారి అయిన హిమాన్షు శుక్లాకు అందచేయాలని టీడీపీ నాయకత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే శనివారం నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన రెండు నియోజకవర్గాల ముఖ్యనేతలు అంతర్గతంగా సమావేశమైనట్లు సమాచారం. నెల్లూరు జిల్లా రాజకీయాల్లో ఉత్కంఠను రేపుతున్న మేయర్ పై అవిశ్వాస తీర్మానం సోమవారంతో తెరపడనున్నది. కాగ ఆ తదుపరి మేయర్ ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. అటు వైసీపీ, ఇటు టీడీపీ బలబలాలను పరిశీలిస్తే 28 ఓట్లు అధికార పార్టీ వైపే (టీడీపీ) ఉన్నాయి.

టీడీపీ బలం 43...

నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో 54 కార్పొరేటర్లు ఉండగా, డిప్యూటీ మేయర్ ఖలీల్ (43వ డివిజన్) రాజీనామాతో ఖాళీ అయింది. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో 28 కార్పొరేట్ స్థానాలుండగా ఒకటి (ఖలీల్ రాజీమానా) మినాహాయిస్తే 27 స్థానాల్లో 20 స్థానాలు టీడీపీ వైపే ఉండగా ఏడుగురు కార్పొరేటర్లు మాత్రమే వైసీపీలో ఉన్నారు. ఎమ్మెల్సీలు చంద్రశేఖర్ రెడ్డి, మేరిగ మురళీలతో కలిసి 9 ఓట్లు సిటీ నియోజకవర్గంలో వైసీపీకి ఉన్నాయి. ఇక నెల్లూరురూరల్ నియోజవర్గ పరిధిలో 26 స్థానాలు ఉండగా అందులో 20 స్థానాల్లో టీడీపీ కార్పొరేటర్లు ఉన్నారు. దాసరి రాజేష్ తటస్థంగా ఉండగా 5 స్థానాల్లో వైసీపీ కార్పొరేటర్లు కొనసాగుతున్నారు. మొత్తంగా అధికార టీడీపీకి 40 మంది కార్పొరేటర్లు ఉండగా, మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఓట్లు కలుపుకుంటే 43 ఓట్లు ఆ పార్టీకి ఉన్నాయి. ఇక వైసీపీకి రెండు నియోజకవర్గాల్లో 15 ఓట్లు ఉండగా ఆ పార్టీకి చెందిన ఒకరు తటస్థంగా ఉన్నారు.



సురక్షితంగా ఒడ్డుకు చేరిన పశువుల కాపర్లు

పెన్నాలో చిక్కుకున్న పశువుల కాపర్లు

- శ్రమించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన పోలీసులు

ఆత్మకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అప్పారావుపాళెం వద్ద పెన్నానదిలో శనివారం సాయంత్రం చిక్కుకున్న ఆరుగురు పశువుల కాపర్లను పోలీసులు శ్రమించి, ఒడ్డుకు చేర్చారు. ఉదయం పశువుల కాపర్లు పశువులను మేపుకునేందుకు పెన్నా నది పరసర ప్రాంతాలకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం ఎక్కువవడంతో నది మధ్యలో చిక్కుకున్నారు. వీరిలో వెంకటరమణయ్య, శ్రీనివాసులు, కాలేషా, కవిత, చెన్నయ్య, పెంచలమ్మ ఉన్నారు. ఐదుగురు మాత్రం నది సమీపంలో ఉన్న కరెంట్ టవర్ వద్ద సురక్షతంగా ఉన్నారు. చెన్నయ్య నది దాటేందుకు ప్రయత్నించి ప్రవాహం ఉధృతి కారణంగా ఇసుక తెన్నులపై జమ్మునాచును పట్టుకుని ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక దళ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలాని చేరుకుని వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. చీకటిగా ఉండడం, నదిలో ప్రవాహం ఎక్కువగా ఉండడంతో వారిని రక్షించేందుకు సకాల విధాలా ప్రయత్నించారు. సంగం మండలం తరుణవాయికి చెందిన గజ ఈతగాళ్లను సీఐ గంగాధర్ రప్పించి వారి ద్వారా ఆ ఆరుగురిని ఒడ్డుకు సురక్షితంగా చేర్చారు.

'నవోదయ'లో ఎస్పీ విచారణ

మర్రిపాడు నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విధ్యాలయాన్ని ఎస్పీ అజిత వేజెండ్ల శనివారం రాత్రి సందర్శించారు. ఇటీవల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి ప్రణీత ఆత్మహత్య చేసుకొన్న విషయం తెలిసిందే. విచారణలో భాగంగా ఎస్పీ విద్యాలయాన్ని పరిశీలించారు. ప్రణీత మృతికి గల కారణాలను సిబ్బంది, సహచర విద్యార్థులను వేర్వేరుగా విచారించారు. ఆమె వెంట ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, సంగం సీఐ వేమారెడ్డి, మర్రిపాడు, దుత్తలూరు ఎస్‌ఐలు ఉన్నారు.

త్వరలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

- అమృత్ 2.0తో ప్రతీ ఇంటికి కుళాయి
- రూ. 50 కోట్లతో డ్రెయిన్ల ఆధునికీకరణ
- పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి



నుడా సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన ఎమ్మెల్యే సోమిరెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

నెల్లూరు (సిటీ), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు త్వరలో టిడ్కో ఇళ్లను అంద చేస్తామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో నుడా, ఎన్ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి సొంత ఇంటి కలను నిజం చేయాలన్న సంకల్పంతో గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో గృహ సముదాయాలను తీసుకువచ్చిందన్నారు. ముప్పాతిక శాఖ పూర్తయిన వాటిని వైసీపీ ప్రభుత్వం కక్షకట్టి నిలిపివేసిందని దుయ్యపట్టారు. వాటన్నీటిని తాజాగా పూర్తి చేసి అందచేస్తామన్నారు. అమృత 2.0 పథకం ద్వారా నెల్లూరులో ప్రతీ ఇంటికి కుళాయి అందచేసి, సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయనున్నట్లు చెప్పారు.నెల్లూరు నగరాన్ని ముంపు నుంచి తప్పించేందుకు రూ. 50 కోట్లు ఖర్చు చేసి ప్రధాన డ్రైన్లను ఆధునీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఫ్లైవోవర్ నిర్మించండి : నుడా చైర్మన్

నగరంలోని తూర్పు, పడమర ప్రాంతాలను కలుపుతూ రైల్వే ఫ్లైవోవర్‌ను నిర్మించాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మంత్రిని కోరారు. టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ చింతారెడ్డిపాళెం వద్ద రైల్వే అండర్‌పాస్‌తో పాటు ఇరువైపుల సర్వీసురోడ్డు, డ్రైన్ల నిర్మాణం చేపడితే నగరంలో ట్రాఫిక్ సమస్య ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, కమిషనర్ నందన్, కావలి, కందుకూరు కమిషనర్లు పాల్గొన్నారు.

కేజీబీవీలో తాత్కాలిక నియామకాలు

నెల్లూరు (విద్య), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వాలేటివారిపాళెం టైప్-4 కేజీబీవీ (ఆదర్శ పాఠశాల)లో 2025-26 విద్యా సంవత్సరానికి తాత్కాలికంగా గెస్ట్ ఫ్యాకల్టీ, డైలీవేజ్ పద్ధతిలో నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గెస్ట్ ఫ్యాకల్టీకి నెలకు రూ.10వేలు, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, చౌకీదార్‌లకు రోజుకు రూ.250లు చొప్పున చెల్లిస్తామన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు సంబంధిత ఎంఈఓ కార్యాలయం నుంచి దరఖాస్తు తీసుకుని, 25వ తేదీలోపు సమర్పించాలని పేర్కొన్నారు.

కీచక ఉపాధ్యాయుడి అరెస్ట్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుబోయమడగల ప్రాథమికోన్నత పాఠశాలలో ఓ కీచక ఉపాధ్యయుడిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు లోకసాని వెంగయ్యను గ్రామస్థులు తల్లిదండ్రులు జూలై 1న దేహశుద్ధి చేసి, ఆయన కారు అద్దాలను ధ్వంసం చేసిన విషయం విదితమే. అప్పట్లో ప్రహరీ దూకి పరారైన ఉపాధ్యాయుడిపై చర్యలు చేపట్టాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి ఎస్ఐ రఘునాథ్ వెంగయ్య కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. హైదరాబాదులో ఉన్నాడన్న పక్కా సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని ఆయన్ను అదుపులోకి తీసుకొన్నారు. అనంతరం ఉదయగిరికి తీసుకొచ్చి స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు.

నూతన కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలి

- కార్మిక ఐక్యవేదిక నేతల డిమాండ్
- జీవో ప్రతుల దహనం



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నెల్లూరు(వైద్యం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నూతన కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కార్మిక ఐక్య వేదిక డిమాండ్ చేసింది. శనివారం నగరంలోని గాంధీబొమ్మ వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేస్తూ కార్మిక చట్టాల నోటిఫికేషన్ ప్రతులను కార్మిక నేతలు దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. దీనిపై పలు మార్లు నిరసనలు తెలియచేసినా కేంద్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని దుయ్యబట్టారు. కార్మిక చట్టాలను ఆధునీకరించేందుకు ఈ నాలుగు కార్మిక చట్టాలను తెస్తున్నామని కేంద్రం చెబుతున్నదంతా పచ్చి అబద్ధమన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిశోర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఉన్న 24 కార్మిక చట్టాలను కార్మికులకు వ్యతిరేకంగా వాటిని కుదించడం సరికాదన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నేత యానాదయ్య మాట్లాడుతూ ఉదాహరణకు ఏదైనా కంపెనీ అర్ధంతరంగా మూసి వేయాల్సి వస్తే 100 మంది కార్మికులు ఉన్నా సంస్థ తప్పని సరిగా కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం నూతన కార్మిక చట్టాల వల్ల 300 మంది కార్మికులు ఉన్న సంస్థలు మాత్రమే ఈ అనుమతులు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీ ప్రసాద్, నేతలు పెంచలనర్సయ్య, సుధాకర్, రాజా సురేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జిలాని, తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు : చలికి వణికిపోతూ పోలీస్ షెల్టర్ కింద తలదాచుకున్న వృద్ధురాలు

అబ్బా.. ఏం చలి!

వణికిస్తున్న శీతల వాతావరణం | ఉదయం 9 గంటల వరకు ఇదే పరిస్థితి | వృద్ధులు, చిన్నారులపై తీవ్ర ప్రభావం | పనులకు వెళ్లాలంటే కూలీలకు తప్పనిపాట్లు

నెల్లూరు (వైద్యం) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం జిల్లాలో చలితీవ్రత ఎక్కువగా ఉంది. రాత్రుళ్లేకాక పగలు కూడా దాని తీవ్రత అధికంగా ఉంది.దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఉదయాన్నే బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. చలి ప్రభావం చిన్నారులు, వృద్ధులపై ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితిలో కొందరు స్వెట్టర్లు, టోపీలు, గ్లౌజులు, ఉన్ని దుస్తులతో చలి నుంచి రక్షణ పొందుతున్నారు. సాయంత్రం 7 గంటల నుంచే చలి మొదలవుతోంది. తెల్లవారు జామున కొద్దిపాటి మంచు కారణంగా రోడ్లపై వెళ్లాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తున్నది. ఉదయం 9 గంటల వరకు చలి తీవ్రత కారణంగా పనులకు వెళ్లాలంటే కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు వర్షాలు కూడా జిల్లాపై ప్రభావం చూపడటంతో చలితీవ్రత అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఉదయం చలిమంటలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలో అక్కడక్కడా కూడా చలిమంటలు కనిపిస్తున్నాయి.

జిల్లాలో ఉష్ణోగ్రతలు

తేదీ	కనిష్ఠంగా
15	24 డిగ్రీలు
16	22.9 డిగ్రీలు
17	23.8 డిగ్రీలు
18	23.5 డిగ్రీలు
19	23 డిగ్రీలు
20	22,4 డిగ్రీలు
21	23 డిగ్రీలు

● ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

చలిగాలుల ప్రభావంతో ప్రజలు పలు రోగాలకు గురవుతున్నారు. ఆస్తమా, నెమ్ము, జలుబు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులతోపాటు జ్వరాలబారిన పడుతున్నారు. చలి ముగిసే వరకు ప్రజలంతా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఉన్ని దుస్తులు ధరించడంతో పాటు మంకీ క్యాప్, స్వెట్టర్లు, శరీరం పూర్తిగా కప్పేలా దుస్తులు, కాళ్లకు సాక్సులు వేసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని వారు చెబుతున్నారు.

● వృద్ధులు, చిన్నారులపై తీవ్ర ప్రభావం

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే 98.6 డిగ్రీల ఫారన్‌హీట్ అవసరం. ఈ ఉష్ణోగ్రత పడిపోయినా, 108కి పెరిగినా శరీరం తట్టుకునే పరిస్థితి లేదు. వృద్ధులు, చిన్నారులపై చలి ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో పాల్సీఫారం, ఇన్‌ఫ్లూమెంజా వైరస్‌లు సంఖ్య పెరిగి బాధితులపై దాడి చేస్తాయి. దీని వల్ల న్యూమోనియా సోకి ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శరీరంలోని చేతివేళ్లు, కాలివేళ్లు, చెవులు కొసలు వంటి భాగాలకు రక్తప్రసరణ ఆగి చర్మవ్యాధులకు దారి తీస్తుంది. ఫంగస్ సమస్య తలెత్తుతుంది. రోగ నిరోధక శక్తి సన్నగిల్లుతుంది. డస్ట్ ఎలర్జీ, లంగ్ ఎలర్జీ వస్తుంది. తక్కువ ఉష్ణోగ్రతల కారణగా 60 ఏళ్లపైబడ్డ వృద్ధులకు, ఐదేళ్లలోపు చిన్నారులకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.



చలికి తట్టుకోలేక గ్రామీణ ప్రాంతాల్లో చలిమంట వేసుకున్న ప్రజలు

● పెరిగిన హీటర్ల వాడకం

చలి నుంచి శరీరాలను కాపాడుకునేందుకు ఇళ్లలో హీటర్లను వాడుకుంటున్నారు. హీటర్లు వినియోగించుకుంటూ గదులను వేడి చేసుకుంటున్నారు. దీంతో హీటర్ల వాడకం అధికమైంది. అలాగే నీటి వాడకం స్నానాలకు ఈ హీటర్ల వాడకం రోజురోజుకు ఎక్కువవుతుంది. అలాగే నీటిని వేడిచేసుకుని తాగేందుకు పలువురు ఇష్టపడుతున్నారు.



తగిన జాగ్రత్తలు అవసరం

ఈ చలికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే అనారోగ్యానికి గురికావాల్సి వస్తుంది. ఇప్పటికే చలి తీవ్రత ఎక్కువగా ఎక్కువగా ఉంది. శ్వాసకోశ వ్యాధులు కూడా ప్రబలే కాలం ఇది . అస్తమా, సీవోపీడీ వంటి వ్యాధులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వీలయినంత వరకు చలి కాలంలో గోరు వెచ్చని నీరు తాగటం మంచిది.

- డాక్టర్ గంగాధర్, జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్

వృద్ధులు, చిన్నారులు తస్మాత్ జాగ్రత్త

వృద్ధులు, చిన్నారులపై చలి తీవ్రత చాలా ప్రభావం చూపుతుంది. వీరి పట్ల కుటుంబ సభ్యులు జాగ్రత్తగా ఉండాలి. లేదంటే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవలి. గుండె, ఊపిరితిత్తులు, మధుమేహం వ్యాధులు ఉన్న వారు ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లకుండా ఉంటే మంచిది. చలికాలంలో ధూమపానానికి దూరంగా ఉండాలి.

- డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు



రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన అన్ని సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని ఏపీ డీసీసీబీ బ్యాంక్స్ ఎస్సీ,ఎస్టీ, బీసీ-వీ ఎంప్లాయీస్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ చంద్రశేఖర్ కోరారు. శనివారం నగరంలోని డీసీసీబీ సమావేశ మందిరంలో ఎన్‌డీసీసీబీ ఉద్యోగ సంఘం సీనియర్ నేత కుమార్‌పాల్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీబీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ప్రతీ డీసీసీబీలో కేడర్ వారీగా రోస్టర్ రిజిస్టర్ నిర్వహించడంతోపాటు వాటిని బహిర్గతం చేయాలన్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి జిల్లా అధ్యక్షుడుగా సీహెచ్ చెంగయ్య, ప్రధాన కార్యదర్శిగా టీ.బాబు, కోశాధికారిగా జే.వంశీకృష్ణ ఎన్నికయ్యారు.

డివైడర్ ఎక్కిన కారు



నెల్లూరురూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు-ముత్తుకూరు రహదారిలో ధనలక్ష్మీపురం వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. అందిన వివరాలు మేరకు.. ముత్తుకూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఎక్కి కొంత దూరం ముందుకు వెళ్లింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇందులో వ్యక్తులు అక్కడ్నుంచి వెళ్లిపోయారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు అందాల్సి ఉంది. ఇక్కడ రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి హెచ్చరికలు లేకపోవడంతో ఇలా నెలలో మూడు, నాలుగు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.

ఆక్రమించు.. అనుభవించు..!

● ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం ● అడ్డుకున్న అధికారులు

ఉదయగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్లపడియ పంచాయతీ పప్పులవారిపల్లిలో అధికార పార్టీకి చెందిన ఓ గ్రామస్థాయి నాయకుడు ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నించాడు. గ్రామ సమీపంలోని 47, 49, 53 సర్వేనంబర్లలో సుమారు 40 ఎకరాల ప్రభుత్వ భూమిలోని చెట్లను రెండు రోజులుగా ఎక్స్‌కవేటర్లతో తొలగించి చదును చేశాడు. అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో తనను ఎవరూ ఏమీ చేయరనే ధీమాతో ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నాడు. దీంతో గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నించిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● ఎంతోమందికి భూములు లేవు.. : గ్రామస్థులు

దశాబ్దాలుగా పప్పులవారిపల్లిలో జీవనం సాగిస్తున్నాం. గ్రామంలో సుమారు 70 కుటుంబాల వారికి సెంటు భూమి కూడా లేదు. దీంతో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్నామని పలువురు గ్రామస్థులు పేర్కొన్నారు. అలాంటిది అధికారం ఉందనే నెపంతో ఒకే వ్యక్తి 40 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ఎక్స్‌కవేటర్లతో చెట్లు తొలగించి కబ్జాకు యత్నించడం దారుణమన్నారు. గ్రామంలో భూమి లేని పేదలను గుర్తించి భూ పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు.



ఆక్రమించేందుకు ఎక్స్‌కవేటర్‌తో చదును చేసిన ప్రభుత్వ భూమి

పోలీసులకు ఫిర్యాదు చేశాం...

పప్పులవారిపల్లిలో ప్రభుత్వ భూమి కబ్జా యత్నించిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. చదును చేసిన భూమిని తమ సిబ్బంది పరిశీలించడంతోపాటు అందులోకి ఎవరూ ప్రవేశించకుండా కాపలాగా ఉంచాం. తాను సైతం పరిశీలించి కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు చేపడతాం.

-షాజియా, ఇన్‌చార్జి తహసీల్దారు

కెరీర్‌పై విద్యార్థి దశ నుంచే సన్నద్ధం కావాలి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏదైనా వృత్తిలో స్థిరపడటానికి విద్యార్థి దశ నుంచే సన్నద్ధత అవసరమని జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ అన్నారు. శనివారం నగరంలోని రావూస్ కళాశాల సమావేశ మందిరంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎంచుకునే కోర్సులు, గ్రూపులకు సంబంధించి అవగాహన అవసరమన్నారు. ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ దశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి వినయ్‌కుమార్, ఇంటర్‌బోర్డు ఆర్‌ఐవో వరప్రసాద్, జిల్లా యూత్ అధికారి మహేంద్రకుమార్‌రెడ్డి, సెట్‌నెల్ సీఈవో నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ సైదా నాయక్, ఎన్ఎస్ఎస్ ఉదయ్, ఏబీసీడబ్ల్యువోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ

కళారంగానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి : ప్రజా నాట్య మండలి

నెల్లూరు(వైద్యం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో కళారంగానికి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రనాయక్, పెంచలయ్యలు డిమాండ్ చేశారు. శనివారం ప్రజానాట్య మండలి జిల్లా మహాసభ సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. డప్పు కళాకారులు బోసుబొమ్మ నుంచి సీపీఐ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నేతలు మాట్లాడుతూ కళారంగానికి ప్రభుత్వ ఆదరణ లేక వివిధ కళారంగాలపై ఆధారపడిన వేలాది మంది కళాకారులు నిర్వీర్యం అవుతున్నారన్నారు. సాంస్కృతక శాఖకు సరైన అధికారులు లేక చాలామంది కళాకారులు ఇతర రంగాలకు వలస వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కళాకారులకు ప్రత్యేకంగా రూ.6వేల పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గతంలో ఎంతో మంది కళాకారులు ఉండే వారని, సరైన ఆదరణ లేక వారు కనుమరుగవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి స్థితిలో ప్రజానాట్యమండలి పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా విజయకుమార్, దల్లు శీనయ్య, కోశాధికారిగా షబ్బీర్ ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయనివ్వొద్దు

నెల్లూరు(సిటీ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్లు, కూడళ్ల వంటి బహిరంగ ప్రదేశాల్లో చెత్త వెయ్యనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ సిబ్బందిని ఆదేశించారు. 28వ డివిజన్ పోస్టల్ కాలనీలో పారిశుధ్య పనులను శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించి మాట్లాడారు. కాలువల్లో విధిగా పూడికతీత పనులు నిర్వహించాలని సూచించారు. కాగా నెల్లూరు - పొదలకూరు రోడ్డులో కొత్తూరు వద్ద రోడ్డు ఆక్రమణలను సిటీ ప్లానింగ్ అధికారులు తొలగించారు.

నేడు భూమిపూజ

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని రంగనాయకుల పేటలోని వెంకటమ్మ పేరంటాళ్ల ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు భూమిపూజ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎం.మోహన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి 3 అంతస్తుల తూర్పు రాజగోపురం, అర్చక గృహం, నివేదన శాల, కార్యాలయం నిర్మాణాలు చేపడతామన్నారు.

దేవుడి భూములు కాపాడండి : కాకాణి

నెల్లూరు(సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి): వెంకటాచలం మండలం కాకుటూరులో శివాలయం భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని పరిరక్షించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఆయన దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డికి భక్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

3న హనుమద్‌వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం),(ఆంధ్రజ్యోతి): నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో డిసెంబరు 3వ తేదీ హనమద్ వ్రతం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు అభిషేకం, హనుమగాయత్రీ హోమం, లక్ష నాగవల్లి దళ (తమలపాకు) అర్చన, పూర్ణాహుతి, ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

పురుగు మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య



మృతదేహన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఏబీఎం చర్చి కాంపౌండ్ ఆవరణలో పురుగుమందు సేవించి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం వెలుగుచూసింది. వివరాల మేరకు.. దగదర్తి మండలం చవటపుత్తేడు గ్రామానికి చెందిన పులి ఎర్రయ్య (65) అనారోగ్యంతో బాధపడతున్నాడు. గత రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులను విచారించడంతోపాటు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ తరుణంలో ఏబీఎం కాంపౌండ్ ఆవరణలో ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. మృతదేహం పక్కన పురుగు, ఎలుకల మందు ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నాడని నిర్ధారించారు. తొలుత గుర్తుతెలియని వ్యక్తిగా భావించి సోషల్ మీడియా వేదికగా ప్రచారం నిర్వహించగా వారి బంధవులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతోపాటు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. కాగా, మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చెరువులో వ్యక్తి మృతదేహం

కావలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు మందాడి చెరువులో గుడ్డిటి రమేష్ (37) మృతదేహన్ని శనివారం స్థానికులు గుర్తించారు. వీఆర్వో పీ. శ్రీనివాసులుకు సమాచారం అందించగా, ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ బాజీబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. రెండు రోజుల క్రితం ముసునూరు గుప్తానగర్ కు చెందిన రమేష్ మానసికస్థితి సరిగాలేక ఇంటి నుండి వెళ్లిపోయాడు. మందాడి చెరువులో లభ్యమైన మృతదేహం రమేష్‌దేనని కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతునికి భార్య విజయ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాజీబాబు తెలిపారు.

నగరంలో ప్రధాన సమస్య ట్రాఫిక్



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) నగరంలో ప్రధాన సమస్య ట్రాఫిక్ అని జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ. శ్రీనివాస్ అన్నారు. శనివారం సాయంత్రం నెల్లూరు, తిరుపతి జిల్లాలకు చెందిన వివిధ విభాగాల అధికారులతో నగరంలోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రించాలంటే ఆటో డ్రైవర్లకు సరైన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సమస్య ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలం అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాగా డిసెంబరు 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇన్సూరెన్స్ కంపెనీ వారు తమ కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే.వాణి, జేసీ వెంకటేశ్వరరావు, ఎస్పీ అజిత వేజెండ్ల, ఏఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ ఓ.వై. నందన్, తిరుపతి కలెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, తిరుపతి ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులిమి అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

నెల్లూరు(విద్య), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ 78వ వ్యవసాథపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వెంగళరావునగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ కేడెట్స్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ కేడెట్స్ దేశ భక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడంతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసంతో నిస్వార్థ సేవలందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని మంజులవాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేడు సత్యసాయి శత జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఆదివారం సత్యసాయిబాబా శత జయంతిని రాష్ట్ర ప్రభుత్వ పండుగగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది, సత్యసాయి వలంటీర్లు, తదితరులు హాజరుకావాలని పేర్కొన్నారు.

● నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న గోమతినగర్‌లోని సత్యసాయి మందిరం (సాయిహృదయ)లో ఆదివారం సత్యసాయి శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ మందిర గౌరవ, అధ్యక్షుడు మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 660

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర రూ.11,881

వెండి కిలో ధర రూ. 1,58,400

వెండి ఒక గ్రాము రూ.163.40

బీటీపీ నగర కమిటీ ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని వేదాయపాళెం స్పిన్నింగ్‌మిల్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన బీటీపీ సమావేశంలో నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడుగా పీ.రమేష్, ఎన్.హరి, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా జీ.శ్రీనివాసులు, వీ.బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున, కోశాధికారిగా ఏ.రాంబాబులతో పాటు అన్ని కమిటీలకు సభ్యులను ఎంపిక చేశారు. ఈ ఎన్నికలను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, కోశాధికారి పీ.ఆదినారాయణ, అదనపు ప్రధాన కార్యదర్శి డీ.మాల్యాద్రి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలతో పాటు జిల్లా నేతలు పాల్గొన్నారు.

పీఎన్‌ఎం హైస్కూల్‌లో సీసీ కెమెరాలు

నెల్లూరు(క్రైం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నబజారు పోలీసులు జెండావీధిలోని పీఎస్ ఎం హైస్కూల్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ఐదు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. శనివారం సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశారు. నేర నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకంగా వ్యవహరిస్తాయని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తెలిపారు.

డ్వామా పీడీకి సన్మానం



డ్వామా పీడీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు(జడ్పీ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వర్షపునీటిని ఒడిసి పట్టి, భూగర్భ జలాలను పెంచ డంతో పాటు, జలసంరక్షణకు కృషి చేసిన డ్వామాకు కేంద్ర జలశక్తి శాఖ జాతీయ అవార్డును ప్రకటించిం ది. దీంతో ఆ అవార్డును కలెక్టర్ హిమాన్షు శుక్లా, పీడీ గంగాభవానీలు ఇటీవల ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి పీఆర్ పాటిల్ చేతులమీదుగా అందుకు న్నారు. దీంతో డ్వామా పీడీ గంగాభవానిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు.

బీవీ రాఘవులను కలిసిన సోమిరెడ్డి

నెల్లూరు(వైద్యం): నెల్లూరుకు వచ్చిన సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సీపీఎం జిల్లా కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు.

శ్రీనివాసమహల్ మధుర జ్ఞాపకం

నెల్లూరు(సాంస్కృతికం): నగరంలోని శ్రీనివాస మహల్ అంటే మధుర జ్ఞాపకం అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. గాంధీబొమ్మ సెంటర్‌లోని శ్రీనివాసమహల్ స్థలంలో జైనులు అపార్టుమెంట్‌లతోపాటు జైన్ మందిరాన్ని నిర్మించారు. ఆ మందిరాన్ని సోమిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసమహల్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు.

బసవతారకం క్యాన్సర్ వైద్యశాలలో

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తన పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని బసవతారకం కేన్సర్ వైద్యశాల సిబ్బందికి నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం వస్త్రాలను పంపిణీ చేశారు. తెలుగు స్వర్గీయ నందమూరి తారక రామారావు, బసవతారకం దంపతుల విగ్రహాలకు ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఎంతో ఉన్నత ఆశయంతో హిందూపురం ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ ఈ వైద్యశాలను తీర్చిదిద్దారని కొనియాడారు.

● టీడీపీ కార్యాలయంలో సంబరాలు

కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదినం సందర్భంగా నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి కేక్ కట్ టీడీపీ శ్రేణులకు పంచిపెట్టారు. ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పనబాక భూలక్ష్మి, ఎస్సీ రమణారెడ్డి, శ్రీదేవి, పోలిశెట్టి, దోర్నాల హరిబాబు, నన్నేసాహెబ్ పాల్గొన్నారు.

తుఫాను బాధితులకు నిత్యావసరాల పంపిణీ

నెల్లూరు(సాంస్కృతిక), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నవ జీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని దీనదయాళ్ నగర్, మంగలిదిబ్బ, శుభం నగర్, నవాబుపేటలోని మొంథా తుఫాను బాధితులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సహదేవయ్య, ప్రాజెక్ట్ డైరెక్టర్ కే విక్టోరియా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి, కోఆర్డినేటర్స్ పీ.శ్రావణి, పీ.లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న నిర్వాహకులు

చిన్నినారాయణరావుకు సన్మానం



చిన్నినారాయణరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావుకు ఘన సన్మానం జరిగింది. విజయవాడలో శనివారం మల్లెతీగ, ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం సంయుక్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న చిన్నినారాయణరావు తెలుగు సాహిత్య విలువలుపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయనను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వైద్యశాల వద్ద పార్క్ చేసిన బైక్ చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. విడవలూరు మండలం చౌకచర్లకు చెందిన కిషోర్‌బాబు పొగతోటలోని ఓ వైద్యశాలలో పనిచేస్తున్నారు. ఆయన తన బైక్‌ను వైద్యశాల ముందు పార్క్ చేసి లోపలికి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా బైక్ కన్పించలేదు. ఈ మేరకు బాధితుడు శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంపేస్తామని బెదిరించడంపై..

నెల్లూరురూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తనను చంపేస్తామని బెదిరించారన్న బాలాజీనగర్‌కు చెందిన సింగవరం మహేష్‌బాబు ఫిర్యాదుపై నెల్లూరురూరల్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ జీ.వేణు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు.. వికీష్, వంశీ, మోహన్‌లు సింగవరం మహేష్ బాబు, మరో వ్యక్తి నడుమ ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఈ క్రమంలో వికీష్, వంశీ, మోహన్‌లు మహేష్‌బాబును బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని రాజుపాళెం వద్దకు తీసుకెళ్లి వారికి ఇవ్వాల్సి రూ.లక్ష ఇవ్వాలని, లేదా మధ్యవర్తిగా ఉన్న మరో వ్యక్తి అడ్రస్సు చెప్పాలని బెదిరించారు. ఈ మేరకు తనకు ప్రాణహాని ఉందని బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలు



బుచ్చిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



విడవలూరు : పార్లపల్లిలో కేక్ కటింగ్

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక టీఎస్ఆర్ కళ్యాణ మండపంలో టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తకేంద్రం, సేవా రక్త కేంద్రం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తేజు డెవలపర్స్ ఆధ్వర్యంలో చింతా శ్రీనివాసులురెడ్డి మొక్కలు నాటి, అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. 3వ వార్డు ఖాజానగర్‌లో కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు మొక్కలు నాటి, బట్టలు పంపిణీ చేశారు. జొన్నవాడ ఆలయంలో చైర్మన్ అశోక్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి వేర్వేరుగా పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శివకృష్ణ, నంద కుమార్, సుమలత, వరలక్ష్మి, చాముండేశ్వరి, శ్రీనివాసులు, సుధాకర్ పాల్గొన్నారు. చైర్‌పర్సన్ సుప్రజమురళి, జొన్నవాడ గిరిజనకాలనీలో దుప్పట్లు పంపిణీ చేసి, 4వ వార్డులో మొక్కలు నాటారు. మలిదేవి కాలువ మస్టర్ కేంద్రం వద్ద కమిషనర్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు పారిశుధ్య కార్మికులతో కేక్ కట్ చేసి, కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, గుత్తా శ్రీనివాసులు, ఎంవీ. శేషయ్య, రామానాయుడు, కాసా శ్రీనివాసులు, ఎస్‌కే. పర్వీన్, హరనాద్, కిషోర్, సుబ్రమణ్యంనాయుడు, సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, సర్పంచు పెంచలయ్య, ఉమ్మయ్యస్వామి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విడవలూరు: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్లపల్లిలో రక్తదానంతో పాటు దండిగుంట - వరిణి ప్రభుత్వ పాఠశాలలో టీడీపీ నాయకులు కుడుముల మల్లికార్జున, బద్దిపూడి రాజ, ఉప్పాల సోమయ్య విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంచారు. రామతీర్థంలో టీడీపీ నాయకులు ఆవుల వాసు, పొన్నాడి చంద్రశేఖర్, అత్తిరాల సురేష్‌లు రామలింగేశ్వర దేవాలయంలో పూజలను నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జ్ అడపాల శ్రీధర్‌రెడ్డి, ఈస్టర్న్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, కోవూరు మాజీ ఏఎంసీ చైర్మన్ పూండ్ల అచ్యుత్‌రెడ్డి, నాయకులు కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, ఎస్‌కే రఫీ, వేగూరు చంద్రారెడ్డి, ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ, పూండ్ల ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: టీడీపీ మండలాధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. నాయకులు, కార్యకర్తలు రక్తదా నం చేశారు. నార్తురాజుపాళెంలో మొక్కలు నాటారు. టీడీపీ నాయకుడు కరకటి మల్లికార్జున పాల్గొన్నారు.

కోవూరు: వేగూరులో ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సర్పంచ్ కరేటి అమరావతి పాల్గొన్నారు. కోవూరులో అన్నదాన కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు కమలాకర రెడ్డి, గాదిరాజు అశోక్ కుమార్ సాయితేజారెడ్డి, బెల్లంకొండ విజయకుమార్, యరమాకల రమణారెడ్డి, సుభాశ్ సేవా సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కోవూరు పీవీఆర్ కళ్యాణమండపం, ఇనమడుగులో యువకులు రక్తదానం చేశారు. మొక్కల్ని నాటారు. టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి, కొల్లారెడ్డి సునీల్‌రెడ్డి పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తన జన్మదినం సందర్భంగా పరీక్ష ఫీజు చెల్లించినట్లు టీడీపీ నాయకుడు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి తెలిపారు.

ఇందుకూరుపేట : గంగపట్నంలో శ్రీచాముండేశ్వరి దేవస్థానం చైర్మన్ గుండాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. జగదేవిపేటలో కూకటి వెంకటేశ్వర్లురెడ్డి, కదురు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు పవన్‌కుమార్ రెడ్డి కేక్ కట్ చేసి రక్తదానం చేశారు. కొండూరు సుధాకర్‌రెడ్డి, చెంచు కిషోర్ యాదవ్, దాసరి విజయ్, మారుబోయిన జనార్థన్‌గౌడ్, బొల్లినేని హరినాయుడు, అవ్వారు ఏడుకొండలు, బీజేపీ నాయకులు కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, జనసేన నాయకులు గుండాల మాధవరెడ్డి పాల్గొన్నారు.

● కొత్తూరు ఎంపీఆర్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జన్మదినం సందర్భంగా పముజుల రవి తన సొంత నిధులతో శనివారం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఏకొల్లు పవన్‌రెడ్డి ప్లాంట్‌ను ప్రారంభించారు.

కోనకు నేడు మంత్రి ఆనం రాక

రాపూరు, 22 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనకు రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదివారం వస్తున్నారని ఆలయ ఉప కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. పెంచలకోన క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన శ్రీవారి పట్ట మహిషి ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారన్నారు. వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ పాల్గొంటారని ఆయన తెలిపారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం : విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని సమగ్రశిక్ష అదనపు కో ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం బుచ్చిలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూలుతోపాటు పెనుబల్లి హైస్కూల్లో నిర్వహిస్తున్న క్లస్టర్ సమావేశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈఓలు దిలీప్‌కుమార్, రత్నం, హెచ్‌ఎంలు వెంక టేశ్వర రావు, రాంగోపాల్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అవగాహన

పొదలకూరు : శమరిమలలో అయ్యప్ప భక్తులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పొదలకూరు పీహెచ్‌సీ డాక్టర్ వైద్యాధికారి కిరణ్ వర్షిత సూచించారు. శనివారం శివాలయంలో అవగాహ న కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

ఆర్థిక సాయం

రాపూరు : రాంకూరు గ్రామంలో చేజర్ల మస్తానమ్మ అంత్యక్రియల కోసం టీడీపీ నేత ఈగ రాజారెడ్డి రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లైట్ల ఏర్పాటు

మనుబోలు : స్వర్ణాటోల్‌వే మెయింటెనెన్స్ చీఫ్ హరిపాండురంగా రావు సూచనలతో ఎలక్ట్రికల్ ఇంజనీర్ మునెయ్య ఆధ్వర్యంలో శనివారం హైవే క్రాసింగ్‌ల వద్ద స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేశారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100) : 660

బంగారం, వెండి ధరలు
బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11,881
వెండి కిలో ధర రూ. 1,58,400
వెండి ఒక గ్రాము రూ.163.40

ప్రైవేట్ బస్సు ఢీకొని మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలు

వలేటివారిపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ బస్సు ఢీకొని మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని రోళ్లపాడు జాతీయ రహదారిపై శనివారం జరిగింది. మండలంలోని జమీన్‌ఉప్పలపాడు గ్రామానికి చెందిన సోమినేని సంహాద్రి మోటారుబైకుపై రోళ్లపాడు నుండి జమీన్‌ఉప్పలపాడు వెళ్తుండగా కందుకూరు నుండి వలేటివారిపాలెం వెళ్తున్న ప్రవేట్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సింహాద్రికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వలేటివారిపాలెం 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేస్తున్నారు.

అయ్యప్పకు విశేష పూజలు

కావలి (టౌన్) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలుగోళమమ్మపేటలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం ఆ వార్డు మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి ఆధ్వర్యంలో అయ్యప్పకు విశేష పూజలు నిర్వహించారు. మాలధారులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు దుగ్గిశెట్టి నవీన్, మాధవి, భవనాసి కృష్ణస్వామి, పొన్నూరు వెంకటస్వామి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తటవర్తి రమేష్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు బద్దిపూడికి ఎంపీ వేమిరెడ్డి రాక

ఉలవపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దిపూడి గ్రామం మాజీ సర్పంచి కూనం అనిల్‌రెడ్డి, కూనం వెంకటసుబ్బారెడ్డిల వర్ధంతిలో నెల్లూరు ఎంపీ మిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి పాల్గొననున్నట్లు టీడీపీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూనం రాఘవరెడ్డి నిర్వహించే కార్యక్రమానికి మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వర్షాలు తగ్గిన వెంటనే పైపులైన్‌కు మరమ్మతులు


పైప్‌లైన్ లీకేజీలను పరిశీలిస్తున్న డీఈ లీలాప్రకాశ్

బిట్రగుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గిన వెంటనే పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాశ్ తెలిపారు. శనివారం బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం ఇందిరా కాలనీలో పైప్‌లైన్ లీకేజ్ వల్ల అంతర్గత రోడ్లు బురదమయమయ్యాయి. జైభీం అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపకులు బత్తుల రవిచంద్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. డీఈ మాట్లాడుతూ ఇందిరాకాలనీ వద్ద రెండు చోట్ల లీకేజ్‌లు గుర్తించామని, వీలైనంత త్వరగా మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. స్థానిక జేఈ శ్రీనివాసులు, అల్లూరు జేఈ పురుషోత్తం, గుత్తేదారుడు మల్లికార్జున సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయం వద్ద హైటెన్షన్

- గదుల నిర్మాణాన్ని అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం
- భారీగా పోలీసుల మోహరింపు ● సాయంత్రానికి ఆందోళన విరమణ


పోలీసు అధికారులతో వాగ్వాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయం వద్ద శనివారం హైటెన్షన్ నెలకొంది. ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ గదుల వల్ల ఆలయం కనిపించకుండా పోయి ప్రాశస్త్యం దెబ్బతింటుందని, తిరుణాళ్ల, ఇతర కార్యక్రమాల సమయంలో వేలాదిగా వచ్చే భక్తులకు కూడా తీవ్ర అసౌకర్యం నెలకొంటుందని అంటూ షాపుల నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, పలువురు ఆచారస్తులు అడ్డగించటంతో సాయంత్రం వరకు ఉద్రిక్తత కొనసాగింది. అంకమ్మ ఆలయ ప్రాంగణంలో షాపుల నిర్మాణం నిలిపివేయాలని కోరుతూ పలువురు కోర్టులో రిట్ పిటీషన్లు దాఖలు చేయగా తానికొండ వెంకటేశ్వర్లు పిటీషన్‌పై అంకమ్మ ఆలయానికి సంబంధించిన 1.52 ఎకరాలలో ఎలాంటి నిర్మాణాలు చేయరాదని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అయితే ప్రస్తుతం నిర్మిస్తున్న షాపులు ఆ 1.52 ఎకరాల్లోనే ఉన్నందున తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శివరాం శనివారం ఉదయం ఆలయం వద్దకు చేరుకుని పనులను అడ్డగించారు. కందుకూరు సీఐ అన్వర్‌బాషా, గుడ్లూరు సీఐ మంగారావుల నేతృత్వంలో నలుగురు ఎస్‌ఐలు, భారీగా కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్ల ఆలయం వద్ద మోహరించటంతో శివరాంను అరెస్టు చేస్తారని అంతా భావించారు. ఒక దశలో ఆయనను కదలకుండా చేసి పనులు చేయించాలని పోలీసులు ప్రయత్నం చేయటంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా శివరాం 'కావాలంటే నన్ను అరెస్టు చేసి పనులు చేసుకోండి.. కానీ అడ్డగిస్తే ఊరుకోను' అని హెచ్చరించటంతో పనులు నిలిపివేశారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం సర్వేచేసి షాపుల నిర్మాణం జరుగుతున్న స్థలం 1.52 ఎకరాల్లో లేదని నిరూపిస్తే నాకు అభ్యంతరం లేదని, ఆ స్థలంలోనే నిర్మాణం జరుగుతున్నదని శివరాం వాదించారు. దీంతో రెండురోజుల్లోగా సర్వే చేయిస్తామని, ఆతర్వాతే పనులు చేయిస్తామని ఈఓ కార్తీక్ హామీ ఇవ్వటంతో శివరాం, ఇతర ఆచారస్తులు అక్కడినుంచి వెళ్లిపోయారు. కాగా, శనివారం రాత్రి పోలీసు బందోబస్తుతో లైట్లు పెట్టి నిర్మాణ పనులు చేశారు.

అతివేగం వల్లే రోడ్డు ప్రమాదాలు : ఆర్టీవో

కందుకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అతివేగం వల్లే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని ఆర్టీవో టీవీఎన్ లక్ష్మీ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీవో కార్యాలయంలో శనివారం రహదారి భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలు ప్రతిఒక్కరూ తప్పకుండా పాటిస్తే చాలావరకు రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. యువత డ్రైవింగ్ లైసెన్సు పొంది వాహనాలు నడపాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలను గుర్తుచేసుకుని వాహనాలు నడిపితే ప్రమాదాలను చాలావరకు నివారించవచ్చునన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ఫ్యామిలీ ఫోటో కనిపించేలా పెట్టుకుంటే మితిమీరిన వేగంతో వాహనాలు నడపకుండా ఉంటారని, ప్రతిఒక్కరూ అది పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ జె. అనిల్‌కుమార్, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జావెలిన్‌త్రో పోటీలకు లింగసముద్రం విద్యార్థి


విద్యార్థి హైకిన్‌తో హెచ్ఎం ఇందిర, ఉపాధ్యాయులు

లింగసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఆర్ కోట జడ్పీ హైస్కూల్ విద్యార్థి చెరుకూరు హైకిన్ రాష్ట్రస్థాయి జావెలిన్‌త్రో పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 21న ఒంగోలులోని నవోదయ స్కూల్ గ్రౌండ్స్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ అండర్-17 విభాగంలో జావెలిన్‌త్రోలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శనివారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ ఇందిర, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు విద్యార్థి హైకిన్‌ను, పీడీ షేక్ సుల్తాన్‌బాషాను అభినందించారు.

గ్రాడ్యుయేషన్ డేకి ఎమ్మెల్యే దగుమాటికి ఆహ్వానం


ఎమ్మెల్యేకి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

కావలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 3న పట్టణంలోని శ్రీలక్ష్మి ఫిజియోథెరపీ కళాశాలలో జరిగే గ్రాడ్యుయేషన్ డేకి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డిని కళాశాల యాజమాన్యం ఆహ్వానించింది. శనివారం ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో కరస్పాండెంట్ డాక్టర్ మాధవరెడ్డి, సిబ్బంది ఎమ్మెల్యేని కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేయాలని ఇవ్వాలని మాధవ రెడ్డి ఎమ్మెల్యేని కోరారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు

కావలి (టౌన్) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జవహర్ భారతి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా శనివారం ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నాగేశ్వరావు, అయూబ్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి పాల్గొని ఎన్ఎస్ఎస్ వలంటర్లచే యోగాసనాలు వేయించారు.దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రమణారెడ్డి, సీహెచ్ సుబ్బరాయుడు, విశ్రాంత అధ్యాపకుడు మన్నేపల్లి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు శనివారం నిర్వహించారు. అర్చకులు సత్యనారాయణచార్యులు బృందంచే స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

ఫిబ్రవరి 26 నుంచి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు

ఈ సందర్భంగా ఆలయ ఈవో రాధాకృష్ణ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 26 నుంచి గిరిప్రదక్షిణ, అంకురార్పణతో నవాహ్నిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దుకాణాల ఏర్పాటుకు డిసెంబరు 1న ఉదయం 11 గంటలకు వేలంపాట జరుగుతుందని ఈవో రాధాకృష్ణ తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ. 11,67,843

వలేటివారిపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 11,67,843 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 6,580, కుంకుమార్చన ద్వారా రూ. 18200, వివాహముల ద్వారా రూ. 5 వేలు, తలనీలాలు ద్వారా రూ. 28975, వాహనపూజలు ద్వారా రూ. 2,160, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 2,40,200, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 1000, రూముఅద్దెల ద్వారా రూ. 35,910, కవర్లు ద్వారా రూ. 10,500, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,54,025, అన్నదానం ద్వారా రూ. 5,65,023, ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ చంద్రశేఖర్ తెలియజేశారు.

పాఠశాల తనిఖీ

కావలి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామమూర్తిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఉదయం మండల విద్యాశాఖాధికారి బండి గోవిందయ్య తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, హ్యాండ్‌బుక్‌లు, డైరీలను పరిశీలించారు. ఉపాధ్యా యులకు వాటి నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. పాఠశాల ఆవరణలో మొక్కలను పెంచుతున్న ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు.

నామినేటెడ్ పదవుల్లో ముస్లింలకు సముచిత స్థానం


ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు

కందుకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని, నామినేటెడ్ పదవుల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలుగా రూ. 90కోట్లు విడుదలచేసిన సందర్భంగా నియోజకవర్గంలోని ముస్లింలు, మతపెద్దలు శనివారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ఏ ముస్లిం వచ్చినా ముఖ్యమంత్రి సహాయనిధికోసం సిఫార్సు చేస్తున్నానని తెలిపారు. పట్టణంలోని కోటకట్ట వీధిలో రూ. 25 లక్షలతో త్వరలో కబరస్తాన్ అభివృద్ధికి పనులు ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు సయ్యద్ అహ్మద్‌బాషా, షేక్ రూబీ, మున్నా, సలాం, ఫిరోజ్, ఫజుల్, నశీర్, ఖాదర్‌బాషా, జియావుద్దీన్, మూస, అస్మతుల్లా, సలీం, గౌస్‌బాషా, ముస్తాక్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కరేడు విద్యార్థి ఎంపిక



ఉలవపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కరేడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి అప్పడి దిలీప్ ఎంపికైనట్లు హెచ్ఎం పీ శ్రీనివాసులు తెలిపారు. ఒంగోలు నవోదయ స్కూల్‌లో ఎస్‌జీఎఫ్ ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్స్ అండర్-17లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో ఎంపికయ్యాడు. ఈనెల 24, 25 తేదీల్లో వినుకొండ లయోలా కాలేజీలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యయుడు పిగిలి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం దిలీప్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ, యూటీఎఫ్ తదితర యూనియన్ల నాయకులు

ఆత్మకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా నాయకులు కొండమూరి హజరత్తయ్య, యుటీఎఫ్ నాయకులు హెచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దుచేసే వరకు కార్మిక వర్గం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, యుటీఈయు నాయకులు టి పెంచలరావు, కె ప్రసాద్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు పి రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన చెందొద్దు : ఏవో


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో కళారాణి

కలువాయి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రబీ సీజన్‌లో వ్యవసాయశాఖ అంచనాల మేరకు మండలంలో 9వేల ఎకరాలకు 1500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని ప్రణాళికతో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి చల్లా కళారాణి తెలిపారు. శనివారం ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏవో మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులలో లేని పొలాల్లో సాగుచేసిన రైతులకు కూడా యూరియా అందిస్తామని తెలిపారు. 2025-26 సంవత్సరానికి ఉపాధి హామీ నిధులతో రూ.3కోట్లతో సిమెంటు రోడ్లు మంజూరైనట్లు, సంక్రాంతి నాటికి పూర్తిచేస్తామని పంచాయతీరాజ్ ఏఈ శివారెడ్డి తెలిపారు. చీపినాపి, కేశమనేనిపల్లి, ఉయ్యాలపల్లి, మాదన్నగారిపల్లెలో అసంపూర్తిగా ఉన్న హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తిచేసేందుకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. దీంతో పాటు నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో దాచూరు, బద్వేలి, కలువాయి, వెంకటరెడ్డిపల్లిలో ఒక్కొక్కటి రూ.35లక్షలతో నూతన హెల్త్‌క్లినిక్ భవనాలు మంజూరైనట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ బి అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో శైలజ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుల ఈకేవైసీ పూర్తి చేయాలి

సంగం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో శనివారం ఉపాధి హామి పథకంపై గ్రామసభలు నిర్వహించారు. అందులో భాగంగా వెంగారెడ్డిపాళెంలో జరిగిన గ్రామసభలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో జాబ్‌కార్డుల ఈకెవైసీ 90 శాతం పూర్తిచేయడం జరిగిందని, మిగిలిన 10 శాతం పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా అర్హత ఉన్నవారు నూతన జాబ్‌కార్డు కోసం నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఉదయ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రవీంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్, గ్రామస్థులు పాల్గొన్నారు. అదేవిధంగా మిగిలిన పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా యెలిశెట్టి కాశీరావు

సీతారామపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం మండల బీజేపీ అధ్యక్షుడిగా యెలిశెట్టి కాశీరావును నెల్లూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడి నియమించారు. శనివారం నెల్లూరులోని భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ యశ్వంత్‌సింగ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షుడికి సన్మానం

ఉదయగిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి తాలుకా ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన షేక్ రియాజ్‌ను శనివారం ఉదయగిరిలో పలువురు ఉద్యోగులు, రాజకీయ నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవుల రోశయ్యయాదవ్, క్షయవ్యాధి నియంత్రణ పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్ నవాజ్, ఆరోగ్య కార్యకర్త ఎండీ మన్సూర్‌అలీ, బీజేపీ నాయకులు చల్లా సుబ్బరత్నం, మస్తాన్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకూ నీరందిస్తాం

- సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వేలూరు కేశవాచౌదరి


కలువాయి చెరువు నుంచి దక్షిణ కాలువకు నీరు విడుదల చేస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్

కలువాయి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోమశిల దక్షిణ కాలువ కింద కలువాయి, చేజర్ల, పొదలకూరు, నెల్లూరు రూరల్ పరిధిలోని చివరి ఆయకట్టు వరకూ సక్రమంగా నీరందించేందుకు తగిన ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వేలూరు కేశవాచౌదరి తెలిపారు. సోమశిల అధికారులు, నీటిసంఘాల ప్రతినిధులతో కలిసి శనివారం ఆయన కలువాయి చెరువు (బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) నుంచి దక్షిణ కాలువకు 250 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సాగునీటిని రైతులు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రబీ సీజన్‌లో దక్షిణ కాలువ కింద సుమారు 50వేల ఎకరాలకు నీరందించ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సోమశిల ఈఈ మహేష్, డీఈలు మస్తానయ్య, బాండ్ బాషా, సుధీర్‌కుమార్, దక్షిణ కాలువ కమిటీ వైస్ చైర్మన్ చల్లా విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్ రెడ్డి, నాపా మాధవనాయుడు, రైతులు తది తరులు పాల్గొన్నారు.

పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ


ఎ సాగరం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

అనంతసాగరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఈవో2 ప్రభాకర్ రెడ్డి, గ్రంథపాలకుడు నారాయణరావు, హెచ్ఎం విజయలక్ష్మీ, జేవీవీ నాయకులు వేము పెంచలయ్య పాల్గొన్నారు.

●ఏఎస్ పేట : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఒ శ్రీనివాసరాజు స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు దేశభక్తి గీతాలు, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రుక్మిణి, స్కూల్ లైబ్రేరియన్ ప్రసన్న, ఉపాధ్యాయుడు ప్రసాద్, నాణేల సేకరణ కర్త ఎండి వాయిజ్ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

కలువాయి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కలువాయి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచు చల్లా ఇందిర జన్మదినం సందర్భంగా శనివారం రాజుపాళెంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఆమె భర్త మండల టీడీపీ కన్వీనర్ చల్లా రఘురామిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు, జామెంట్రీ బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు, పేట్లు తదితర వస్తువులు పంపిణీ చేశారు.

పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈవో

ఉదయగిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల ప్రణాళికను సమర్థవంతంగా అమలుచేసి పది విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలని డిప్యూటీ డీఈవో జానకిరామ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని దాసరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతులవారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. వచ్చే ఏడాది మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగనున్నాయి, ఈ పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఆయన తొలుత ఉదయగిరి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పాఠశాల సముదాయ సమావే శాన్ని తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యా యులు శ్రీనివాస్, మొఘల్‌ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

వింజమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి మెడలో గొలుసును బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు లాక్కొని పరారైన సంఘటన మండలంలోని చాకలికొండ గ్రామంలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వృద్ధురాలు కాటంరెడ్డి చిన్నరవణమ్మ బంధువుల ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో గొలుసును లాక్కుని వింజమూరు వైపు పారిపోయారని, గొలుసు విలువ రూ.3లక్షలపైనే ఉంటుందని బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రతాప్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యుత్ లైన్‌మన్ మృతి

ఆత్మకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విధి నిర్వహణలో విద్యుత్ మరమ్మతులు చేస్తూ ప్రమాదానికి గురై నెల్లూరులో చికిత్స పొందుతున్న నాగులపాడు గ్రామ లైన్‌మేన్ పాణ్యం విజయ్(53) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. శనివారం అతని మృతదేహాన్ని స్వగ్రామమైన అనంతసాగరం మండలం సంజీవనగర్‌కు తరలించారు. విజయ్ మృతి పట్ల విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది, యుఈఈయు నాయకులు సంతాపం వ్యక్తంచేశారు.

చేజర్ల డిప్యూటీ తహసీల్దారుగా మస్తానయ్య

చేజర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చేజర్ల మండల డిప్యూటీ తహసీల్దారుగా ఆర్ మస్తానయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరిస్తానన్నారు.









గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువుగా..

తిరుచానూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీవారి ప్రియ వాహనమైన గరుడుడిపై లోకమాత ఊరేగారు. శ్రీవారి పాదాలు, సహస్ర లక్ష్మీకాసుల హారంతో ఉత్సవమూర్తిని అలంకరించారు. తన పతి శ్రీమహావిష్ణువు రూపంలో అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. కళాబృందాలు, ప్రదర్శనలు, జీయర్ స్వాముల ప్రబంధ పారాయణం, వేదగోష్ఠి, భక్తుల గోవింద నామస్మరణ మధ్య రాత్రి 7 గంటలకు ప్రారంభమైన గరుడ వాహన సేవ 10.30 గంటల వరకు సాగింది. గరుడుడిపై అమ్మవారిని తిలకించడానికి తరలివచ్చిన భక్తులతో మాడవీధులు, పుష్కరిణి ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఉదయం సర్వభూపాల వాహనసేవ వైభవంగా జరిగింది. అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాల అనంతరం అద్దాల మండపం నుంచి ఉత్సవర్లను వాహన మండపానికి తీసుకొచ్చి సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చారు. దర్బార్ కృష్ణుడి అలంకారంలో తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఈ కార్యక్రమాల్లో జియ్యర్ స్వాములు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర, పనబాక లక్ష్మి, సాంబశివరావు, జానకీదేవి, ఆలయ డిప్యూటీ ఈవో హరీంధర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

● **బంగారుతేరుపై త్రిలోక పావని :** గరుడసేవకు ముందు స్వర్ణరథం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్నపన తిరుమంజనం అనంతరం అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించి, మధ్యాహ్నం 3.30 గంటలకు ఉత్సవమూర్తిని ఆలయం నుంచి వేంచేపుగా రథ మండపానికి తీసుకొచ్చి స్వర్ణరథంపై కొలువుదీర్చారు. భక్తుల కోలాటాలు, భజన బృందాల నడుమ 4.20 గంటలకు సర్వతేజోమయమైన అమ్మవారు స్వర్ణరథంపై తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. స్వర్ణరథాన్ని లాగేందుకు మహిళలు పోటీపడ్డారు. అమ్మవారు శ్రీమహాలక్ష్మి రూపాన్ని ధరించి అభయప్రదానం చేశారు.



● శ్రీవారి పాదుకల ఊరేగింపు

గరుడోత్సవంలో అమ్మవారికి శ్రీవారి పాదుకలను అలంకరించడం ఆనవాయితీ. తిరుచానూరులో గరుడసేవ రోజున అమ్మవారికి శ్రీవారు తన గుర్తుగా పాదుకలు పంపుతారని పురాణాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయం నుంచి స్వామివారి స్వర్ణ పాదుకలను తిరుచానూరులోని పసుపు మండపానికి తీసుకొచ్చి అర్చకులు పూజలు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాటాలు, భజన బృందాల నడుమ వాటిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. రాత్రి శ్రీవారి పట్టపురాణి పద్మావతీ అమ్మవారు స్వామివారి పాదుకలు ధరించి గరుడసేవలో తరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం
మధ్యాహ్నం 12 గంటలకు స్నపన తిరుమంజనం
రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనం

కేంద్ర నిధులు ఖర్చు చేయండి

- **వెనక్కిపోయే ప్రమాదం ఉంది**
- **దిశ సమీక్ష సమావేశంలో ఆందోళన**
- **శ్రీకాళహస్తి కమిషనర్ గైర్హాజరు... క్రమశిక్షణా చర్యలకు కలెక్టర్ ఆదేశం**

తిరుపతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా జిల్లాకు కేటాయించే నిధులను సకాలంలో ఖర్చు చేయాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన దిశ (జిల్లా అభివృద్ధి, సమన్వయ మరియు పర్యవేక్షణా కమిటీ) త్రైమాసిక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సకాలంలో వాటిని వినియోగించుకోకపోతే వెనక్కి వెళతాయని, తిరిగి విడుదలయ్యే అవకాశమే ఉండదని అన్నారు. అనంతరం వివిధ పథకాల అమలు తీరును కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌తో కలసి సమీక్షించారు.

పీఎం ఆదర్శ గ్రామాలకు రూ.10 కోట్లిస్తే ఖర్చు పెట్టింది రూ.1.11 కోట్లే!

పీఎం ఆదర్శ గ్రామ యోజన పథకం కింద ఈ ఏడాది మేలో రూ.10.33 కోట్లు సర్దుబాటు కాగా అందులో ఇప్పటి దాకా కేవలం రూ.1.11 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం పట్ల ఎంపీ, కలెక్టర్ ఇరువురూ అసంతృప్తి వ్యక్తం చేశారు. డిసెంబరు 31వ తేదీలోపు నిధులను ఖర్చు చేయకుంటే వెనక్కిపోతాయని హెచ్చరించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

చెరువుల్లో గుంతలు తవ్వడమే ఉపాధా?

ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో కేవలం చెరువుల్లో గుంతలు తవ్వే పనులు తప్ప వేరే పనులు ప్రతిపాదించడం లేదని డ్వామా శ్రీనివాస ప్రసాద్ సమావేశం దృష్టికి తెచ్చారు. గతేడాది రూ.157 కోట్ల పనులు చేపట్టగా అందులో ఇంకా రూ.46 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందన్నారు. రూ.8.98 కోట్లతో సీసీ రోడ్లు, రూ.10.39 కోట్లతో బీటీ రోడ్లు కొత్తగా చేపడతామన్నారు. రోడ్ కనెక్టివిటీ లేని గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే శ్మశాన వాటికలకు దారులు, ఇతర సదుపాయాలు కల్పించాలని ఎంపీ, కలెక్టర్ ఆదేశించారు. నాయుడుపేట మండలంలో సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు కట్టి మూడేళ్లవుతున్నా ఫైనల్ బిల్లులు మంజూరు కాలేదని ఎంపీపీ ధనలక్ష్మి ఫిర్యాదు చేశారు. బిల్లుల మంజూరులో వివక్ష ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, చిత్రంలో ఎంపీ గురుమూర్తి

జిల్లాలో 24 వేల ఇళ్లు పూర్తి

హౌసింగ్‌పై సమీక్షలో జిల్లాలో 37,400 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటికి 24,390 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని జిల్లా హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు చెప్పారు.

జిల్లాకే సీఎస్‌ఆర్ నిధులు

జిల్లాలోని పరిశ్రమల నుంచి రూ.180 కోట్లు సీఎస్‌ఆర్ కింద రావాల్సి ఉందని, ఈ నిధులను జిల్లా అవసరాలకే వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

శ్రీకాళహస్తి కమిషనర్‌పై చర్యలకు కలెక్టర్ ఆదేశం

కాగా దిశ సమావేశానికి శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్ గైర్హాజరయ్యారు. ఆయనకు బదులు మున్సిపల్ కార్యాలయం నుంచి వచ్చిన మహిళా ఉద్యోగి ఒకరు సమాధానమిచ్చారు. దీనిపై కలెక్టర్ ఆగ్రహించారు. కమిషనర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పలువురు మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, ఎంపీపీలు, డీఆర్వో నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

181 చెరువుల అభివృద్ధికి రూ.515 కోట్లతో ప్రతిపాదనలు

జలవనరుల శాఖలో ట్రిపుల్ ఆర్ కార్యక్రమం కింద ఎక్కువ ఆయకట్టు కలిగిన 181 చెరువులను అభివృద్ధి చేసేందుకు రూ.515 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని ఆ శాఖ అధికారులు చెప్పారు. ఈ పనులకు 60-40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్రాలు నిధులు కేటాయించాల్సి ఉందని, అలాగే కాలువల అభివృద్ధికి మరో రూ.200 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. జిల్లాలో తరచూ తుఫాన్ల బెడద ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలకు 570 పనులు ప్రతిపాదించామని వివరించారు.

జిల్లాలో మోస్తరు వర్షం

● వడమాలపేటలో అత్యధికంగా 54.2మి.మీ.

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వీస్తున్న తూర్పు గాలుల ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం తిరుపతి నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో తేలికపాటి వానపడింది. వడమాలపేటలో అత్యధికంగా 54.2మి.మీ. వర్షపాతం నమోదైంది. బీఎన్‌కండ్రిగ 53.4, బాలయ్యపల్లె 49.6, చిట్టమూరు 48.8, ఎర్రావారిపాళెం 40, ఓజిలి 38.6, నాగలాపురం 35.4, డక్కిలి 31.8, ఏర్పేడు, తడ 30.4, తొట్టంబేడు 29.8, తిరుపతి అర్బన్ 26.2, రూరల్ 25.4, గూడూరు, సత్యవేడు, ఆర్‌సీపురం, నాయుడుపేట, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లులో 24.6మి.మీ. వంతున నమోదైంది. జిల్లాలో సగటున 26.5మి.మీ వర్షపాతం నమోదైంది. సోమ, మంగళవారాల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారే అవకాశముండటంతో ముందస్తు జాగ్రత్తగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.



టాస్క్‌ఫోర్సు ఏఎస్పీ బాధ్యతల స్వీకరణ

మంగళం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్సు అదనపు ఎస్పీగా కులశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన తిరుపతి ఏఎస్పీ(శాంతిభద్రతలు)గా పనిచేశారు. టాస్క్‌ఫోర్సుకు అటాచ్ చేయడంతో టాస్క్‌ఫోర్సు హెడ్, ఎస్పీ సుబ్బరాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు.

టాస్క్‌ఫోర్సు హెడ్ సుబ్బరాయుడిని కలిసిన ఏఎస్పీ కులశేఖర్

పంచమితీర్థం ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ

తిరుచానూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశేష ఘట్టమైన పంచమితీర్థం ఈనెల 25వ తేదీన జరుగనుంది. అమ్మవారి పుష్కరిణి పద్మసరోవరంలో జరిగే ఈ ఉత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి లక్ష మందికి పైగా భక్తులు వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా టీటీడీ, పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. శనివారం అమ్మవారి ఆలయ మాడవీధులతోపాటు పుష్కరిణిని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. పంచమితీర్థం విజయవంతానికి అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని జేఈవో వీరబ్రహ్మం సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్ ఆస్తులపై ఏసీబీ ఆరా

● రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి వివరాలు తెప్పించే పనిలో అధికారులు


తిరుపతి(నేరవిభాగం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరకామణి చోరీ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రవికుమార్ ఆస్తులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. అతని ఇళ్లు, వ్యాపార లావాదేవీలు, స్థిర, చరాస్తులకు సంబంధించిన వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. తిరుపతి, చంద్రగిరి, విజయవాడ, హైదరాబాద్, తమిళనాడులోని చెన్నైతోపాటు మరో ఐదు ప్రాంతాల్లో, కర్ణాటకలోని ధార్వాడ్, హుబ్లీ, బెంగళూరుల్లో భారీ ఎత్తున ఆస్తులను గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు సేకరించే పనిలో ఏసీబీ అధికారులు ఉన్నారు. భూములు, ప్లాట్లు, మామిడి తోపులు, అపార్టుమెంట్లు, విల్లాలు, ఇతర చరాస్తులు ఎవరి పేర్లతో ఉంచాడు? బినామీలు ఎవరు? ఇతని వెనుక వుండి కథ నడిపించిన సూత్రధారులు ఎవరు అనే వివరాలు సేకరిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి డాక్యుమెంట్లు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

రేపటి నుంచి పునఃవిచారణ

పరకామణి కేసు వారం రోజుల విరామం తర్వాత సోమవారం నుంచి పునఃప్రారంభం కానుంది. హైకోర్టు ఆదేశాల మేరకు సీఐడీ డీజీ నేతృత్వంలో ప్రస్తుత దర్యాప్తు అధికారులతో పాటు అదనంగా మరో 10 మంది సీఐ, ఎస్‌ఐలను విచారణ నిమిత్తం నియమించారు. రవికుమార్‌తో పనిచేసిన సిబ్బందితో పాటు కొంతమంది టీటీడీ పెద్దలను తిరుపతి పద్మావతి అతిథిగృహంలో విచారించనున్నారు. మాజీ సీవీఎస్వో నరసింహ కిషోర్‌ను కూడా విచారించే అవకాశముంది.

రేపటి నుంచి 'రైతన్నా మీకోసం'

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో సోమవారం నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖల సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారి రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రైతూ ఈ కార్యక్రమంలో పాల్గొని సూచనలు, అభిప్రాయాలు తెలపాలని కోరారు.



నిండిన కాళంగి

మూడు గేట్ల ఎత్తివేత

కేవీబీపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు చేరడంతో మండలంలోని కాళంగి జలాశయం నిండింది. నీటి మట్టం 20 అడుగులకు చేరడంతో అధికారుల సూచనల మేరకు శనివారం 18 గేట్లలో మూడు గేట్లను మూడు అడుగుల ఎత్తున ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఏఈ నదియ తెలిపారు.

లైఫ్ సర్టిఫికెట్ ఫిబ్రవరిలోపు ఇవ్వండి

● జిల్లా ఖజానా అధికారి లక్ష్మీకర్‌రెడ్డి

తిరుపతి(జీవకోన),నవంబరు22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ (యాన్యువల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్)ను 2026 ఫిబ్రవరి 28వ తేదీలోపు అందజేయాలని జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఎం.లక్ష్మీకర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ గతంలో నవంబరు, డిసెంబరు నెలల్లో సర్టిఫికెట్ తీసుకునే వారని, ఇప్పుడు దాన్ని జనవరి, ఫిబ్రవరికి మార్చినట్లు చెప్పారు. జిల్లాలోని 17,426 మంది పెన్షనర్ల సౌకర్యార్థం తిరుపతిలోని ఉప ఖజానా కార్యాలయంలో రెండు కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాకాల, చంద్రగిరి, పుత్తూరు, సత్యవేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వాకాడు, గూడూరు, వెంకటగిరిలోని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లోనూ సర్టిఫికెట్ అందజేయవచ్చన్నారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

తిరుపతి(సెంట్రల్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచాలని ఇండియన్ రైల్వే కోచింగ్ విభాగం ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన్‌కుమార్ కింది స్థాయి అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటనలో భాగంగా శనివారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. టెండర్ ఒప్పందం మేరకు నిర్ణయించిన గడువు లోపు పనులు ఎందుకు పూర్తి చేయలేదని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అంతకు ముందు ఆధునిక స్టేషన్ ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూశారు. ఈ కార్యక్రమంలో జోనల్ చీఫ్ ఇంజనీర్ కె.సూర్యనారాయణ, నిర్మాణాల విభాగం అధికారులు శ్రీనిభాష్, జి.వామనమూర్తి, సీనియర్ డీవోఎం శ్రావణకుమార్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్‌ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, దరూరు ప్రభాకర్, మాధవరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తిరుపతి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన్ కుమార్

28 వరకు తిరుపతి - హిస్సార్ ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి - హిస్సార్ మధ్య నడుస్తున్న వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను డిసెంబరు 28వ తేదీ వరకు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న ఈ ఎక్స్‌ప్రెస్‌లు ప్రతి బుధవారమూ తిరుపతి నుంచి, ప్రతి ఆదివారమూ హిస్సార్ నుంచి బయలుదేరుతాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా సీఐటీయూ నిరసన



గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్‌ చేశారు. శనివారం స్థానిక టవర్‌ క్లాక్‌ సెంటర్‌ వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కార్పోరేట్‌ ప్రయోజనాల కోసం లేబర్‌కోడ్‌లను తీసుకురావడం దారుణమన్నారు. పెట్టుబడిదారులకు, కార్పోరేట్‌ సంస్థలకు కేంద్రప్రభుత్వం కొమ్ముకాయడం మంచిది కాదన్నారు. కార్మికుల పనిగంటలు పెంచడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీటూ శివకుమార్‌, బీవీరమణయ్య, చంద్రయ్య, ప్రసాద్‌, మణి, వెంగ్రావు, రామయ్య, మురళి, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధికలాభాలు


మాట్లాడుతున్న గోపీనాయక్‌

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక లాభాలను పొందవచ్చునని వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్‌ అన్నారు. శనివారం స్థానిక ప్రాతీయ పశువైద్యశాలలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా వివిధ రకాల కషాయాలను వినియోగించి సాగు చేపట్టడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. సాగులో ఖర్చుతగ్గి దిగుబడులు పెరుగుతాయన్నారు. ప్రకృతి విధానం ద్వారా పండించిన పంటలను స్థానికంగా విక్రయాలు సాగించుకుని ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చునన్నారు.కార్యక్రమంలో రవిచంద్రప్రసాద్‌, మధు, భవానీ, రమేష్‌, వరప్రసాద్‌, రమాదేవి, తిరుమల, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా విజేతలకు అభినందన


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సింహాద్రి

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చదువులతోపాటు క్రీడలలోనూ రాణించాలని ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సింహాద్రి అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షటిల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కావలిలో విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్‌కళాశాల క్రీడాపోటీలలో తమ కళాశాలకు చెందిన మునిలక్ష్మి, శ్రావణి అనే విద్యార్థినీలు షటిల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలలో ప్రతిభచాటి రన్నర్‌గా నిలిచారన్నారు. పీడీ డాక్టర్‌ నారాయణరాజు పాల్గొన్నారు.

తాగునీటి వసతికి వితరణ


తాగునీటి ట్యాపులను ప్రారంభిస్తున్న రోటరీక్లబ్‌ సభ్యులు

గూడూరు అర్బన్‌, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చదువులతోనే సమాజంలో ఉజ్వలభవిష్యత్తు ఉంటుందని శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్‌ అన్నారు. శనివారం స్థానిక మినీ గురుకులంలో రోటరీక్లబ్‌ ఆధ్వర్యంలో మయూరి శ్యామ్‌యాదవ్‌ దాతృత్వంతో విద్యార్థులకు తాగునీటి సదుపాయాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ గురుకులంలో చదివే విద్యార్థినులకు తాగునీటి అవసరాలను తీర్చినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, బాలకృష్ణంరాజు, సురేష్‌రెడ్డి, మేరీప్రియత, రజినీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధికి సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ అన్నారు. శనివారం స్థానిక నియోజకవర్గ విజన్‌ యాక్షన్‌ప్లాన్‌ యూనిట్‌ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పొదుపుసంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని సీఎం చంద్రబాబునాయుడు పొదుపు సంఘాలను తీసుకువచ్చి అనేక సంక్షేమపథకాలను అమలుచేస్తున్నారన్నారు. ఎంపీడీవో మధుసూదన్‌రావు, వివిధశాఖల అధికారుల, పొదుపుసంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌ మార్పులపై ఫ్యాకల్టీకి అవగాహన


జ్యోతిప్రజ్వలన చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్‌ విశ్వక్సేనారెడ్డి

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ఇంజనీరింగ్‌ కళాశాలలో శనివారం ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఆటోమోటీవ్‌ మోడల్స్‌ డిజైన్‌, టెస్టింగ్‌ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ విశ్వక్సేనారెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్‌ విద్యలో నూతన ధోరణిలు, పరిశ్రమ అవసరాలు, ఆధునిక వాహన సాంకేతిక పరిజ్ఞానాలను అధ్యాపకులకు పరిచియం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ ప్రసాద్‌రావు, డాక్టర్‌ రాజేష్‌రెడ్డి, డాక్టర్‌ జగదీష్‌, స్వర్ణా, శరవణన్‌, రమేష్‌, వినయ్‌, డాక్టర్‌ దత్తాత్రేయశర్మ, కొండారెడ్డి పాల్గొన్నారు.

భారీ గుంతలతో ప్రజల అవస్థలు


బంగారుపేట వద్ద గూడూరు రోడ్డు దుస్థితి ఇది

వెంకటగిరిటౌన్‌, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వర్షాలకు గూడూరు రోడ్డు, బంగారుపేట, పెద్ద శివాలయం వద్ద, ఆనంద పురం తదితరప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఈనీరు గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిని గుర్తించలేక గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మత్తు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

టీడీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ


శ్రీధర్‌రెడ్డిని పరామర్శిస్తున్న పాశిం

కోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యానగర్‌లో శనివారం పలువురు టీడీపీ నాయకులను ఎమ్మెల్యే డాక్టర్‌ పాశిం సునీల్‌కుమార్‌ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకొని కోలుకుంటున్న సీనియర్‌ నాయకుడు మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే టీడీపీ మైనార్టీసెల్‌ జిల్లా అధ్యక్షుడు షేక్‌ జలీల్‌ అహ్మద్‌, వెంకన్నపాళెం సర్పంచ్‌ మధుయాదవ్‌లు కూడా శ్రీధర్‌రెడ్డిని పరామర్శించారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

తడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అక్కంపేట సబ్‌ స్టేషన్‌ పరిధిలో ఆదివారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయమేర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ మురళీ ఓ ప్రకటనలో తెలిపారు. అక్కంపేట, గ్రద్దగుంట, చేనిగుంట, అండగుండాల, కొండూరు, కాదలూరు, వాటంబేడు, గోపాలరెడ్డిపాళెం, గొల్లలమలుగు గ్రామాల్లో ఆర్‌డీఎస్‌ఎస్‌ పథకం పనులు జరుగుతున్నాయన్నారు. ఈప్రభావంతో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెడికల్‌ కళాశాల్ని ప్రైవేట్‌ చేయొద్దు


ఆర్డీవో కార్యాలయ ఏవో రవికుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌యు నాయకులు

సూళ్లూరుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్‌ కళాశాలలను ప్రభుత్వం ఆధీనంలోనే నడపాలని పీడీఎస్‌యు డిమాండ్‌ చేసింది. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద జిల్లా పీడీఎస్‌యు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి లోకేష్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్‌ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడం తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. జీవో నెంబరు 107, 108లను రద్దుచేయాలని కోరారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయ ఏవో రవికుమార్‌కు వినతిపత్రంను సమర్పించారు. పీడీఎస్‌యూ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్‌, కార్యవర్గ సభ్యులు జాన్సన్‌, రాహుల్‌ పాల్గొన్నారు.

డక్కిలి పాఠశాల హెచ్‌ఎం మృతి


డీవీరెడ్డి (ఫైల్‌ఫొటో)

డక్కిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల యూటీఎఫ్‌ మాజీ అధ్యక్షుడు, డక్కిలి వెంకటేశ్వర్లు రెడ్డి (55) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. జ్వరంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. వెంకటేశ్వర్లు రెడ్డి మృతి చెందారని తెలుసుకొన్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహనికి పూలమాలలు వేసి నివాళలు అర్పించారు. డివిరెడ్డిగా సుపరిచరితులైన ఈయన ఉపాధ్యాయ సంఘాల్లో సుదీర్ఘకాలం క్రియాశీలంగా పనిచేశారు.

నేడు సత్యసాయి జయంతి

ఓజిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్‌ కార్యాలయంలో ఆదివారం పుట్టపర్తి సాయిబాబా జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. మండలంలోని అందరు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు జిల్లా రెజ్లింగ్‌ జట్టు ఎంపిక

పెళ్లకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోసనూరు రాజుపాలెంలో ఆదివారం జిల్లా రెజ్లింగ్‌ పోటీలకు ఎంపిక నిర్వహించనున్నట్లు రెజ్లింగ్‌ క్రీడల ప్రెసిడెంట్‌ సురేష్‌, సెక్రటరీ ఉదయ్‌కుమార్‌, ట్రెజరర్‌ అభిలాష్‌లు తెలిపారు. పురుషుల ఫ్రీ స్టైల్‌ విభాగంలో 57, 61, 65, 70, 74, 79, 86, 92 కేజీలు, పురుషుల గ్రీకో రోమన్‌ విభాగంలో 55, 60, 63, 67, 72, 77, 82, 87 కేజీలు, మహిళల విభాగంలో 50, 53, 55, 57, 59, 62, 65, 68 కేజీల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సంప్రదించాలని కోరారు. 2005లో పుట్టినవారు అర్హులన్నారు. 2006, 2007 జన్మించినవారు మెడికల్‌ సర్టిఫికేట్‌ తీసుకురావాలని కోరారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్‌ భక్తులు వేచి ఉన్నారు.

- గురువారం హుండీ ఆదాయం: రూ.3.75 కోట్లు
- శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,098
- తలనీలాలు సమర్పించినవారు: 24,962

10 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రేణిగుంట - కడప రహదారిలోని అంజనేయపురం చెక్‌పోస్టు వద్ద శనివారం తిరుపతి అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని కారును సీజ్‌ చేశారు. అటవీ క్షేత్రాధికారి సుదర్శన్‌రెడ్డికి అందిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి నుంచి అంజనేయపురం చెక్‌పోస్టు వద్ద టీఎన్‌పాళెం సెక్షన్‌ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున అటువైపుగా కారు వేగంగా వస్తుండటాన్ని గమనించిన సిబ్బంది టార్చ్‌లైట్లు వేసి ఆపేందుకు ప్రయత్నించగా, ఆపకుండా వేగంగా కొంతదూరం వెళ్లి డ్రైవర్‌ కారును వదలిపారిపోయాడు. కారును తనిఖీ చేయగా 10 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గమనించారు. దీంతో వాహనాన్ని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం 280.4 కేజీలు బరువు ఉందని, కారుతో సహా ఎర్రచందనం విలువ రూ.6లక్షలు ఉంటుందని అటవీ క్షేత్రాధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

మామూళ్ల మత్తులో బెల్టు షాపుల జోరు


బహిరంగంగానే తాగుతున్న మందుబాబులు

వెంకటగిరిటౌన్‌, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెతుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో వందకుపైగా బెల్టు దుకాణాలు ఏర్పాటయ్యాయి. అనధికారిక దుకాణాలకు పట్టపగలే మద్యం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ మద్యం షాపు నుంచి గ్రామాల్లో ఆటోల ద్వారా వారే బెల్టు దుకాణాలకు డోర్‌ డెలివరీ చేస్తున్నట్లు సమాచారం.గత వైసీపీ ప్రభుత్వంలో ఆపార్టీ ముఖ్యనేతలు, ఎక్సైజ్‌, పోలీసు శాఖలు ఆడిందే ఆటగా దందా సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా బెల్టు షాపుల జోరు కొనసాగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణం నుంచి అధికారులకు నెల వారీ మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తనిఖీకి వచ్చే స్క్వాడ్‌ బృందాలకు సైతం ముడుపులు ముట్టజెబుతున్నారని తెలుస్తోంది. కొందరు ప్రజాప్రతినిధులు లైసెన్సుదారుల నుంచి బినామీల పేర్లపై వాటాలు తీసుకోవడంతో మద్యం అక్రమాలను అడ్డుకునే వారు కరవయ్యారనే విమర్శలున్నాయి.

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్‌ అసెంబ్లీ


మాక్‌ అసెంబ్లీలో విద్యార్థులు


స్పీకర్‌గా వ్యవహరిస్తున్న విద్యార్థిని

నాయుడుపేట టౌన్‌, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎల్‌ఏసాగరం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మాక్‌ అసెంబ్లీ ఆకట్టుకుంది. రాజ్యాంగదినోత్సవ వారోత్సవాలలో భాగంగా శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి తెలిపారు. మాక్‌ అసెంబ్లీలో 2.0 జీఎస్టీ మీద మాక్‌ డ్రిల్‌ నిర్వహించి సూపర్‌ జీఎస్టీ, సూపర్‌ సేవింగ్‌ అంటూ ఒకేదేశం, ఒకే పన్ను, ఒకే మార్కెట్‌ గురించి విద్యార్థులు చక్కగా ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఆనంద్‌, చెంచుకుమార్‌, సుబ్రహ్మణ్యం, సుభాషచంద్ర, అమృతవల్లి, జి. వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, సుధాకరయ్య పాల్గొన్నారు.

విజయం కోసం సమష్టిగా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శంకరయ్య

సూళ్లూరుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులంతా కలసికట్టుగా పనిచేసి విజయం సాధించేలా కృషి చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు లోక్కు శంకరయ్య కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల టీడీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూరుశాతం సీట్లు గెల్చుకునేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.సమావేశంలో పార్టీ నాయకులు సుధాకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడు శీనారెడ్డికి నివాళులు


శీనారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం


తడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీనియర్‌ పాత్రికేయుడు శీనారెడ్డి మృతదేహానికి పలువురు పార్టీనాయకులు, ప్రముఖులు నివాళులర్పించారు. అనారోగ్యం కారణాలతో శుక్రవారం రాత్రి శీనారెడ్డి మృతి చెందిన విషయం విదితమే. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, బెస్త కార్పోరేషన్‌ ఛైర్మన్‌ బొమ్మన శ్రీధర్‌, ఏఎంసీ ఛైర్మన్‌ ఆకుతోట రమేష్‌, సూళ్లూరుపేట మున్సిపల్‌ ఛైర్మన్‌ శ్రీమంత్‌రెడ్డి, నాగేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌ ఆదినారాయణరెడ్డి, టీడీపీ, వైసీపీ నాయకులు గోపాల్‌రెడ్డిపాళెంలోని శీనారెడ్డి ఇంటికి చేరుకొని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. సీనారెడ్డి నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. ఆచార్య భరద్వాజా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్‌ ఐబ్యాంక్‌ సభ్యులు వచ్చి ఆ ప్రక్రియ నర్విహించారు.

గ్రామస్థాయి నుంచి టీడీపీ బలోపేతం చేయాలి


నాయకులతో సమావేశమైన టీడీపీ కన్వీనరు విజయకుమార్‌నాయుడు

ఓజిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల టీడీపీ అనుబంధ సంఘాలను ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు చెప్పారు. ఈమేరకు శనివారం ఓజిలిలోని పార్టీ కార్యాలయంలో గ్రామ కమిటీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయినుంచి బలోపేతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్‌, బీసీ, మైనారిటీ సెల్‌ జిల్లా ఉపాధ్యక్షుడె పాడి వెంకటసుబ్బయ్య, ఎస్‌కె ఖలీల్‌, ఏఎంసీ డైరెక్టరు కోటేశ్వరరావు, కురుగొండ సొసైటీ అధ్యక్షులు అంకయ్య, కమలాకర్‌ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం


కమిటి సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌, తదితరులు

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ కోరారు. శనివారం స్థానిక రైతబజారు సమీపంలోని ధర్మరాజులస్వామి ఆలయంలో ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టిందన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్‌గా వాటంబేడు శివకుమార్‌, సభ్యులుగా సుజాత, వై.విజయ, కేశవర్ధన్‌రావు, శాంతి, ఏ.విజయ, మౌనిక, సుబ్బరత్న, జయమ్మ, మాధవ, లక్ష్మణ్‌రావు ప్రమాణస్వీకారం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు చదలవాడ హరిప్రసాద్‌, శీలం కిరణ్‌కుమార్‌, పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజ్యాంగ దినోత్సవ సభ



నినాదాలు చేస్తున్న బహుజన ఐక్యవేదిక నాయకులు

కోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఆదివారం బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో బహిరంగసభ జరుగుతుంది. తెలంగాణ మంత్రి గడ్డం వివేక్‌, రచయిత రేంజర్ల రాజేష్‌, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్‌, రాష్ట్ర మాల ఉద్యోగసంక్షేమ సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబులతోపాటు ఎంట్రపాటి శ్రీనివాసరావు, దాసరి సుందరంలు హాజరుకానున్నారు. ఈక్రమంలో శనివారం బహుజన ఐక్యవేదిక నాయకులు ర్యాలీ నిర్వహించారు.రిజర్వేషన్ల కోసం ఐక్యంగా పోరాటం చేసేందుకే బహిరంగసభ ఏర్పాటు చేస్తున్నామని బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడె మీజూరు మాధవ్‌ తెలిపారు. కార్యక్రమంలో బహుజన నాయకులు పాలా మల్లికార్జున్‌, అశోక్‌, సాయి, పోలయ్య, కోటి, కేశవ్‌ తదితరులు ఉన్నారు.

సులభతర బోధనపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంఈవో మస్తానయ్య

కోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యాబోధనలో మారుతున్న సమీకరణలు దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు సులభతర విద్యపై దృష్టి కేంద్రీకరించాలని ఎంఈవో మస్తానయ్య కోరారు. పెదగోవిందపల్లి, కోటలోని బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలు, చిట్టేడు ఉన్నత పాఠశాలల్లో శనివారం స్కూల్‌ కాంప్లెక్స్‌ సమావేశాలు జరిగాయి. కోట బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎంఈవో మస్తానయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన కార్పోరేట్‌స్థాయికి మించిందన్నారు. దీనికి అనుగుణంగా విద్యాశాఖ సహకారం అందిస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుగుతున్నాయన్నారు. సమావేశాలలో పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వీస్‌ రోడ్డులోకి రాని ఆర్టీసీ బస్సులు


జాతీయ రహదారిపై బస్సుల కోసం నిరీక్షణ

చిల్లకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎచిల్లకూరులో సర్వీసు రోడ్డులో ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై అండర్‌పాస్‌ వంతెన, ఇరువైపులా ఆర్టీసీ బస్సుల కోసం సర్వీసురోడ్డు ఏర్పాటు చేశారు. ప్రయాణికుల నిరీక్షించేందుకు బస్‌షెల్టర్‌ను నిర్మించారు. అయితే ఆర్టీసీ బస్సులు సర్వీసు రోడ్డుకు రావడంలేదు. మండల కేంద్రం కావడంతో ఎక్కువ మంది పనులపై వస్తుంటారు. సర్వీస్‌ రోడ్డులోని బస్సులు రాక ప్రజలు జాతీయరహదారిపై నిలబడి ఎదురు చూడాల్సివస్తుంది. అధికారులు స్పందించి సర్వీసు రోడ్డులో బస్సులు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో పబ్లిక్‌ అండర్‌టేకింగ్‌ కమిటీ(పియూసీ) ఛైర్మన్‌ కూన రవికుమార్‌, నందమూరి రామకృష్ణ ఉన్నారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి


మహేష్‌ మృతదేహం


మృతుని కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున టీడీపీ నేతలు

వెంకటగిరి, నవంబర్‌ 22 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. వెంకటగిరి మండలం యాతలూరు గ్రామానికి చెందిన రెట్టపల్లి మహేష్‌ (24) వ్యవసాయ కూలి పనులు చేస్తుంటాడు. ఇతడి భార్య అరుణ తొమ్మిది నెలల గర్భిణి. శనివారం ఉదయం ఎప్పటిలాగే పొలం పనులు చేయడానికి వెళ్లాడు. మధ్యాహ్నం వాతావరణం మారిపోయింది. భారీ వర్షం కురిసింది. దీంతో అక్కడ పనిచేస్తున్న వారితో కలిసి ఓ గుడిసెలో తలదాచుకున్నాడు. వర్షం తగ్గిందని బయటకు రాగానే వెంటనే ఓ పిడుగు మీద పడింది. దీంతో అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. పక్కనున్న కలవగుంట సురేష్‌ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మహేష్‌ మృతితో కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. కొన్ని రోజుల్లో భార్య ప్రసవించనున్న తరుణంలో అతడు ప్రాణాలు విడవడం స్థానికులను కలచివేసింది. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఎమ్మెల్యే రామకృష్ణ ఫోన్‌లో మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, మంకు ఆనంద్‌, చలపతి, మురళీలు ఆస్పత్రికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందచేశారు.